
సాక్షి
వికారాబాద్

మంగళవారం । 3 । సెప్టెంబర్ । 2024



జడివానలో జన జాతర

నీళ్లపల్లి అటవీ ప్రాంతంలోని సప్త కొలనులలో వెలసిన ఏకాంబరి ఆలయానికి భక్తులు పోటెత్తారు.

8లో ▸



ప్రతి ఇంటికీ సంక్షేమం

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు.

9లో ▸



వాన.. హైరానా..!

జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న జోరు వానలకు ప్రాజెక్టులు, చెరువులు, వాగులు నిండి మత్తడిపోస్తున్నాయి.

9లో ▸

నేడు కొడంగల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో ఫోన్ ఇన్

వర్షాకాలం నేపథ్యంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు తదితర విషయాలపై ఫోన్ ఇన్ ద్వారా ఆస్పత్రి సూపరింటెండెంట్ సలహాలు, సూచనలు ఇస్తారు.





అంశం: డెంగీ, చికున్‌గున్యా తదితర సీజనల్ వ్యాధులు

డాక్టర్: చంద్రప్రియ, సూపరింటెండెంట్, కొడంగల్ ప్రభుత్వాస్పత్రి

తేదీ: 3-09-2024 (మంగళవారం)

సమయం: ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్లు:
90529 93058, 98861 06290, 91777 77235

అలుగుల గలగల
నిండుకుండల్లా ప్రాజెక్టులు

- జిల్లాలో మొత్తం చెరువులు 1,179
- అలుగు పారుతున్నవి 690
- వందశాతం నిండినవి 489
- నేల కూలిన ఇళ్లు 10
- దెబ్బతిన్న పంటలు 889 ఎకరాలు



అలుగు పారుతున్న శివసాగర్ ప్రాజెక్టు

వికారాబాద్: మూడు రోజులుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. శని, ఆదివారాల్లో వర్షం బీభత్సం సృష్టించగా సోమవారం రోజంతా ముసురేసింది. జిల్లాలోని చెరువులన్నీ నిండిపోయాయి. ఏటా సెప్టెంబర్ చివరి నాటికి గానీ చెరువులు అలుగు పారేవి కావు.. కానీ నెల ప్రారంభంలోనే మెజార్టీ చెరువులు నిండిపోయాయి. ఎడతెరిపి లేని వర్షాలకు చెరువులు, ప్రాజెక్టుల్లోకి భారీగా నీరు చేరుతోంది. జూన్, జూలై, ఆగస్టు మాసం చివరి వరకు కొంచం అటూ ఇటూగా సాధారణ వర్షపాతం నమోదైంది. గత మూడు రోజుల్లో భారీ వర్షపాతం నమోదైంది. దీంతో కొన్ని పంటలకు మేలు జరగ్గా మరి కొన్ని దెబ్బతిన్నాయి. వరినాట్లు వేసుకునే రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో జూన్ మొదటి వారం నుంచి ఆగస్టు వరకు సాధారణ వర్షపాతం 466 మిల్లీమీటర్లు కాగా ఇప్పటి వరకు 661 మి.మీ. నమోదైంది.

ప్రధాన ప్రాజెక్టులన్నీ ఫుల్

జిల్లాలో 1,179 చెరువులు ఉండగా అన్ని పూర్తిగా నిండిపోయాయి. 690 చెరువులు అలుగు పారుతుండగా.. 489 చెరువులు నిండుకుండల్లా మారాయి. కాలువలు సరిగ్గాలేని, ఆక్రమణలకు గురైన చెరువులు మాత్రమే ఇంకా నిండలేదు. జుంటుపల్లి, కోట్‌పల్లి, సర్పన్‌పల్లి, శివసాగర్ ప్రాజెక్టులు అలుగు పారుతుండగా కాకర్లవాగు, లఖ్నాపూర్ ప్రాజెక్టు వందశాతం నీటి మట్టానికి చేరుకున్నాయి. ఇప్పటికీ వరద ఉధృతి కొనసాగుతున్న నేపథ్యంలో చెరువులన్నీ అలుగు పారే అవకాశం ఉందని నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు.

899 ఎకరాల్లో పంట నష్టం

ప్రస్తుత సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 6లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు 5 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేశారు. మరో 1.10 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయవచ్చని అధికారులు తెలిపారు. చెరువులు, కుంటలు, బావులు, బోరుబావుల్లో నీరు పుష్కలంగా ఉండటంతో వరి నాట్లకు రైతులు సిద్ధమవుతున్నారు. ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులు మాత్రం అధిక వర్షాలతో ఆందోళనకు గురవుతున్నారు. దాదాపు 50 శాతం పంట పొలాల్లో నీరు నిలిచింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలో పది ఇళ్లు కూలిపోయాయి. 899 ఎకరాల్లో ఆయా పంటలు పాడయ్యాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టకుంటే పంటలు మరింత దెబ్బతింటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

నీట మునిగిన పంటల పరిశీలన



నారాయణపూర్‌లో నీట మునిగిన పంటను పరిశీలిస్తున్న అధికారులు

అనంతగిరి: వికారాబాద్ మండలం నారాయణపూర్‌లో నీట మునిగిన పంటలను సోమవారం జిల్లా వ్యవసాయాధికారి మోహన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి పంటనష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జ్యోతి, ఏఈఓ కావ్య తదితరులు పాల్గొన్నారు.



అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి చిలుకవాగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

హైడ్రా తరహాలో.. కబ్జాల స్వాధీనానికి కమిటీ

- తాండూరు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఎసెస్ ప్రొటెక్షన్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేస్తాం
- అన్యాక్రాంతమైన చిలుకవాగు, చెరువులు, కుంటలను పరిరక్షిస్తాం
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- ముంపు ప్రాంతాల్లో పర్యటన
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

తాండూరు: పట్టణంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకునేందుకు హైడ్రా తరహాలో తాండూరు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఎసెస్ ప్రొటెక్షన్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. సోమవారం తాండూరులోని ముంపు ప్రాంతాలైన హైదరాబాద్ రోడ్, సాయిపూర్, తులసీనగర్, పాతకుంట, మార్కండేయ కాలనీతోపాటు పలు ప్రాంతాలను మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, పలు శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. తొలుత చిలుక వాగును సందర్శించారు. వాగు పరివాహక ప్రాంతం పూర్తిగా అన్యాక్రాంతం కావడంతో కాలనీలు ముంపునకు గురవుతున్నాయని పేర్కొన్నారు. వాగుకు అడ్డంగా నిర్మాణాలు చేపట్టిన వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంఐఎం తాండూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ హదీ శౌరీ స్పందించి తాను చిలుక వాగు ప్రవాహానికి స్థలం వదులుతానని, రికార్డుల ప్రకారం వాగు పరివాహక ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. చిలుక వాగుపై ఉన్న కట్టడాలను తొలగించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. మరో మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. పునరావస కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. చిలుక వాగు పరిరక్షణ కోసం రూ.16 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. హైడ్రా తరహాలోనే తాండూరు పట్టణంలో కబ్జాలను స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. మున్సిపాలిటీని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు డీపీఆర్ తయారు చేయడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఈఈ సుందర్, డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, తహసీల్దార్ తారాసింగ్, మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి, కౌన్సిలర్లు ప్రభాకర్‌గౌడ్, నీరజాబాల్‌రెడ్డి, వరాల శ్రీనివాస్‌రెడ్డి, హిందూ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింహులు, నాయకులు హబీబ్‌లాల, లొంక నర్సింహులు, బంటు వేణు, బంటు మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వర్షాలతో జాగ్రత్తగా ఉండండి

ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి



దౌల్తాబాద్ పెద్దచెరువును పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, అధికారులు

దౌల్తాబాద్: ముసురు వర్షాల నేపథ్యంలో పాత ఇళ్లలో నివసించే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి సూచించారు. సోమవారం దౌల్తాబాద్ పెద్దచెరువును సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చెరువులు, వాగులు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాతావరణ శాఖ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిస్తున్నందున ప్రజలు అత్యవసరమైతే తప్పా బయటకు రాకూడదని పేర్కొన్నారు. విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని సూచించారు.

ఆర్టీసీ లాజిస్టిక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



గుల్బర్గాలో ఆర్టీసీ లాజిస్టిక్ సేవలను ప్రారంభిస్తున్న అధికారులు

పరిగి: ఆర్టీసీ లాజిస్టిక్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి, నల్లగొండ లాజిస్టిక్ ఇన్‌చార్జ్ రవీందర్ సూచించారు. కర్ణాటక రాష్ట్రం, గుల్బర్గాలో సోమవారం టీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్ సేవలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గుల్బర్గా నుంచి నిత్యం ఎంతో మంది పరిగి మీదుగా హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. ఇక్కడి నుంచి తెలుగు రాష్ట్రాలతోపాటు ఎక్కడికైనా పార్సిల్స్‌ను పంపవచ్చని పేర్కొన్నారు. తక్కువ ఖర్చు, త్వరగా గమ్యానికి వస్తువులు చేరవేయడంలో ఆర్టీసీ కార్గో ముందు ఉందన్నారు. కార్యక్రమంలో లాజిస్టిక్ టీం లీడర్స్ విశ్వనాథం గౌడ్, భానుప్రసాద్, వసంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 71 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 71 అర్జీలు రాగా భూ సమస్యలపై 59, పింఛన్ల కోసం 2, ఇతర సమస్యల పరిష్కారం కోసం 10 దరఖాస్తులు వచ్చాయి. వాటిని సంబంధిత శాఖల అధికారులకు బదలాయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ఆర్డీఓ వాసు చంద్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

చిరస్మరణీయుడు వైఎస్సార్

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిరస్మరణీయుడని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం తాండూరులో వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఇందిరమ్మ కాలనీలోని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు జరిగిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఎంతో మంది పేద, మధ్య తరగతి వర్గాలకు గూడు కల్పించారన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టిస్తామని మోసం చేసిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. కార్యక్రమంలో తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు ప్రభాకర్‌గౌడ్, వెంకన్నగౌడ్, రామకృష్ణ, నాయకులు బంటు వేణుగోపాల్, మలప్ప తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంలో నిర్లక్ష్యం తగదు

రంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్

కందుకూరు: పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్ అన్నారు. మండల పరిధిలోని కొత్తగూడలో సోమవారం ఆయన ఆకస్మికంగా పర్యటించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో అక్కడక్కడ వర్షం నీరు నిలిచి ఉండటంతో శానిటేషన్ సరిగ్గా చేయడం లేదని గుర్తించారు. ఫాగింగ్ కూడా చేయలేదని, కంపోస్టు యార్డులో తడి, పొడి చెత్త వేరు చేయడం లేదని గమనించి పంచాయతీ కార్యదర్శి ఉమాదేవిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాకాల సీజన్‌లో పారిశుద్ధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ సరిత, ఎంపీఓ గీత ఉన్నారు.



కొత్తగూడలో అధికారులు, సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా పంచాయతీ అధికారి

సమాచారం ఇవ్వండి

- గణేశ్ మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పని సరి
- ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని పోలీసులకు సహకరించాలి
- ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: గణేశ్ మండపాలు ఏర్పాటు చేసుకునే వారు ఆన్‌లైన్‌లో వివరాలు పొందుపరచాలని, సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో కూడా సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని ఎస్పీ నారాయణ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటే భద్రత, బందోబస్తు ఏర్పాటు చేయడానికి సులువుగా ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్ ఇన్ఫర్మేషన్‌కు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన పని లేదన్నారు. మండపాల అనుమతి కోసం https://-policeportal.tspolice.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



ఎస్పీ నారాయణరెడ్డి

ఎస్పీ సూచనలు

- మండపం ఏర్పాటు చేసే సమయంలో షార్ట్ సర్క్యూట్ జరగకుండా నాణ్యమైన వైర్లను ఉపయోగించాలి.
- మండప నిర్వాహకులు, కమిటీ సభ్యుల పేర్లు, ఫోన్ నంబర్లు మండపంలో ఏర్పాటు చేయాలి. తమ పరిధిలోని పోలీస్ అధికారుల ఫోన్ నెంబర్లు ఉంచుకోవాలి.
- మండపాల్లో డీజేలను ఏర్పాటు చేయరాదు.
- విగ్రహాలు ఉంచే ప్రదేశంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా నాణ్యమైన షెడ్ ఏర్పాటు చేసుకోవాలి.
- మండపంలో 24 గంటల పాటు ఒక వలంటీర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలి.
- భక్తులను దృష్టిలో ఉంచుకొని మండపం వద్ద క్యూ ఏర్పాటు చేసుకోవాలి. వలంటీర్లను నియమించాలి.
- అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి.
- మండపంలో పాయింట్ బుక్ ఏర్పాటు చేసుకోవాలి. పోలీసు అధికారుల తనిఖీకి వచ్చినప్పుడు అందులో సంతకం చేస్తారు.
- మండపాల్లో అనుమానాస్పద బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, వస్తువులు కనిపించినా.. వ్యక్తులు సంచరించినా వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మరాదు.
- ఎలాంటి సందేహాలు ఉన్నా పోలీసులు లేదా డయల్ 100, జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ సెల్ నంబర్ 87126 70056కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలి.

పేదలకు అండగా ప్రభుత్వం



ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డిని సన్మానించిన హిందూ ఉత్సవ కేంద్ర సమితి సభ్యులు

ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి

తాండూరు టౌన్: పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం 11 మంది లబ్ధిదారులకు రూ. 5.35 లక్షల విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందన్నారు. ఇప్పటికే రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రవిరాజు, నాయకులు హరిసూదన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రఘు, నారాయణరెడ్డి, సిద్ధు, భీమప్ప, శ్రీనివాస్, సంకేత్ తదిరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి రూ.25 లక్షలు

తాండూరులో హిందూ ఉత్సవ కేంద్ర సమితికి కేటాయించిన రెండెకరాల స్థలంలో ప్రహరీ నిర్మాణానికి తన నిధుల నుంచి రూ.25 లక్షలు కేటాయిస్తానని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆ సమితి నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షురాలు, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింలు, కోశాధికారి భాను, ఉపాధ్యక్షుడు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పరిగి: పట్టణంలోని తుంకల్‌గడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సునీత పద్మావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 – 25 సంవత్సరానికి గాను తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులు బోధించేందుకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ పూర్తి చేసిన ఎస్సీ ఎస్టీలు 50శాతం, ఇతరులు 55శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఈనెల 3వ తేదీ (మంగళవారం) ప్రభుత్వ కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

పలు మార్గాల్లో బస్సులు రద్దు

తాండూరు: భారీ వర్షాల నేపథ్యంలో పలు మార్గాల్లో బస్సులను తాత్కాలికంగా రద్దు చేశామని తాండూరు ఆర్టీసీ డీఎం సురేష్‌కుమార్ సోమవారం తెలిపారు. తాండూరు – శ్రీశైలం, తాండూరు – సేడం, తాండూరు – మహబూబ్‌నగర్ బస్సులను రద్దు చేసినట్లు వివరించారు. తాండూరు – మహబూబ్‌నగర్ మార్గంలో మహబూబ్‌నగర్ జిల్లాలో రోడ్డు వరదకు తెగిపోవడం వల్ల బస్సులను తాత్కాలికంగా నిలిపివేయడం జరిగిందన్నారు. తాండూరు – చించోళి, జహీరాబాద్, సంగారెడ్డి మార్గాల్లో బస్సులు నడుస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్ మార్గంలో యథావిధిగా బస్సులు తిరుగుతాయని తెలిపారు.

తక్షణమే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలి

- తక్షణమే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలి
- టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలతో విద్యుత్ సరఫరాలో ఎక్కడైనా అంతరాయాలు ఏర్పడితే తక్షణమే పునరుద్ధరించాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ ఆదేశించారు. విద్యుత్ సర్కిల్ కార్యాలయాల సీఈలు, ఎస్ఈలతో సోమవారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వర్షాలతో భారీ వృక్షాలు, ఇతర వస్తువులు విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని తెలిపారు. ముందుగా కూలిపోయిన చెట్లను తొలగించి కొత్త స్తంభాలను, లైన్లను వేయాలని సూచించారు. గత రెండు రోజులు విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు సిబ్బంది ఎంతగానో కృషి చేశారని ప్రశంసించారు. సూర్యాపేట జిల్లాలో విద్యుత్ పంపిణీ వ్యవస్థకు భారీ నష్టం వాటిల్లిందని, 1,200కు పైగా స్తంభాలు కూలిపోగా, 4 సబ్ స్టేషన్లకు నష్టం జరిగిందని వివరించారు. మొత్తం 2,417 స్తంభాలు, 21 ట్రాన్స్‌ఫార్మర్లు, 18 సబ్ స్టేషన్స్ దెబ్బతిన్నాయని తెలిపారు. సిబ్బంది స్థానికంగా ఉండి పునరుద్ధరణ పనుల్లో పాల్గొనాలని కోరారు. పాడైపోయిన పరికరాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని, ఇందుకు సరిపడా అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్లుప్తంగా

యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు

ఇరిగేషన్ డీఈఈ కిరణ్‌కుమార్



కోతకు గురైన కట్టను పరిశీలిస్తున్న దీఈఈ కిరణ్‌కుమార్

దౌల్తాబాద్: చెరువులు, తూముల లీకేజీలు అరికట్టేందుకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పనులు చేపడతామని ఇరిగేషన్ డీఈఈ కిరణ్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని చెరువులు, కుంటలను పరిశీలించారు. పెద్ద చెరువు కట్ట కోతకు గురైందని వెంటనే మరమ్మతులు చేపడతామన్నారు.

కిడ్నీలు పాడయ్యాయి.. ఆదుకోండి

సీఎం, స్పీకర్‌లకు బాధితుడి విన్నపం



కృష్ణ

ధారూరు: తన రెండు కిడ్నీలు పాడయి ఆరోగ్యం క్షీణించింది.. చొరవ తీసుకుని ఆదుకోవాలని బాధితుడు సోమవారం ముఖ్యమంత్రి, శాసనసభ స్పీకర్‌ను విన్నవించాడు. మండల పరిధిలోని మున్నూరుసోమారం గ్రామానికి చెందిన కోరెం కృష్ణ రెండు కిడ్నీలు ఇన్ఫెక్షన్‌తో పాడయ్యాయి. దీంతో కుటుంబీకులు వెంటనే ఆయన్ను నగరంలోని ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. డయాలసిస్‌కు రూ.2లక్షల వరకు వెచ్చించినట్లు బాధితుడు వాపోయాడు. ప్రస్తుతం తన ఆరోగ్యం మరింత దెబ్బతిన్నదని.. వైద్యానికి చేతిలో చిల్లిగవ్వ లేదని వైద్యానికి సహకరించి తనను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరాడు.

అదుపుతప్పిన లారీ



రోడ్డు పక్కన గుంతలోకి దూసుకెళ్లిన లారీ

కుల్కచర్ల: డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడపడంతో లారీ రోడ్డు పక్కన గుంతలోకి దూసుకెళ్లింది. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం కుల్కచర్ల నుంచి చౌడాపూర్ వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ మద్యం సేవించి ఉన్నాడు. ఒక్క సారిగా వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనున్న గుంతలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. డ్రైవర్ చక్రవర్తికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సమాచారం.

ఆందోళన అనవసరం

- అర్హులైన రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు
- వికారాబాద్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు స్వరూప



ఏఓలతో మాట్లాడుతున్న ఏడీఏ స్వరూప

ధారూరు: రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. అర్హులైన రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని వికారాబాద్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు స్వరూప అన్నారు. సోమవారం ఆమె ధారూరు రైతు వేదికను సందర్శించారు. ఈ సందర్భంగా ఏఓలు రైతుల వివరాలు కంప్యూటరీకరిస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ.. అన్ని వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో జతచేసి ప్రత్యేక యాప్‌ద్వారా ప్రభుత్వానికి పంపుతున్నామని రైతులకు వివరించారు. ఆధార్‌కార్డులో, అప్పు ఖాతాలో పేర్లు వేర్వేరుగా ఉంటే బ్యాంకులకు వెళ్లి సరిచేసుకోవాలని సూచించారు. ఆధార్ కార్డును బ్యాంకు ఖాతాతో లింక్ చేయించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు సంజూ రాథోడ్, మంజుల, రైతులు పాల్గొన్నారు.

రోడ్లు ధ్వంసం బాట నరకం

గుంతలమయంగా రహదారులు

ఇబ్బంది పడుతున్న జనం

ప్రయాణమంటేనే ప్రజలు జంకుతున్నారు. జిల్లా వ్యాప్తంగా రోడ్లన్నీ గుంతలమయంగా మారి ఇబ్బంది పడుతున్నారు. ఓ వైపు ప్రభుత్వం వీటి నిర్మాణానికి భారీగా నిధులు మంజూరు చేస్తోందని ప్రజాప్రతినిధులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. గుంతలను చూసి గగ్గోలు పెడుతున్న ప్రజానీకం అధికారులు, కాంట్రాక్టర్ల తీరుపై మండిపడుతున్నారు. రహదారుల దుస్థితిపై 'సాక్షి' ప్రత్యేక కథనం



మర్పల్లి: బురదమయంగా ఫార్మేషన్ రోడ్డు



యాలాల: అడాల్‌పూర్ రోడ్డు..



మర్పల్లి: రావులపల్లి సమీపంలో రోడ్డుపై గుంతల్లో నిలిచిన నీరు



మర్పల్లి: బూచన్‌పల్లి-జాజుగుబ్బడి తండాకు వెళ్లే మార్గం..



మోమిన్‌పేట: ఎన్కేపల్లిలో పంచాయతీ రాజ్ రోడ్డు దుస్థితి



పెద్దేముల్: గుంతలమయంగా తాండూరు-సంగారెడ్డి, పెద్దేముల్-బుద్దారం మార్గం



లాల్‌పహాడ్ రోడ్డులో చన్గోముల్ వద్ద వర్షానికి తెగిన కల్వర్టు



మోమిన్‌పేట: దుర్గంచెర్వు వద్ద..



తాండూరు రూరల్: తాండూరు- చించోళి ప్రధాన రోడ్డు దుస్థితి



పెద్దేముల్: రోడ్డుపై గుంతలను రాళ్లతో పూడ్చిన స్థానికులు



కుల్కచర్ల: గుంతలమయంగా చౌడాపూర్ - బూరేటిపల్లి రోడ్డు



కుల్కచర్ల: వాగులోంచి ప్రమాదకరంగా ప్రయాణం



గుంతలు పడిన మన్నెగూడ-చన్గోముల్ రోడ్డు

కొత్త జీపీగా తింసాన్‌పల్లి

గెజిట్ విడుదల చేసిన ప్రభుత్వం



పెద్దేముల్: మండల పరిధిలోని తింసాన్‌పల్లికి గ్రామ పంచాయతీ హోదానిస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిందని ఎంపీడీఓ జర్నప్ప, ఎంపీఓ రతన్‌సింగ్‌లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో మండంలోని పంచాయతీలు 38కి చేరాయని అధికారులు వెల్లడించారు. ఆరు వార్డులతో నూతన పంచాయతీ ఏర్పడిందన్నారు. ఈ నెల 6న పంచాయతీ ఎన్నికల ఓటరు లిస్టును గ్రామ పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయంలో నోటీస్ బోర్డుపై ఏర్పాటు చేస్తామని ఎంపీడీఓ తెలిపారు. ఈ నెల 7 నుంచి 13వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని.. వీటిని 19న డీపీఓ పరిష్కరించి 21న తుదిజాబితా విడుదల చేస్తారని వివరించారు.

చెరువులు, ప్రాజెక్టులకు పూర్తిస్థాయి జలాలు

నీటిపారుదల శాఖ ఈఈ సుందర్



తాండూరు: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో జిల్లాలో ఉన్న ప్రాజెక్టులు, చెరువులు పూర్తిగా నిండి అలుగులు పారుతున్నాయని నీటిపారుదల శాఖ ఈఈ సుందర్ తెలిపారు. సోమవారం ఆయన నియోజకవర్గంలోని పలు చెరువులను సందర్శించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ.. జిల్లాలోని కోట్‌పల్లి, జుంటిపల్లి, శివసాగర్ ప్రధాన ప్రాజెక్టులు మత్తడి దూకుతున్నాయని చెప్పారు. చెరువులు, కుంటలు నిండి వాగులు ప్రవహిస్తున్నాయన్నారు. మరో మూడు రోజులు వర్షసూచన ఉండటంతో చెరువులపై నిఘా ఉంచామన్నారు.

ఆకస్మికంగా ఆశ్రమ పాఠశాల తనిఖీ

- ఎమ్మెల్యే టీఆర్ఆర్‌కు సమస్యల ఏకరువు
- వారానికి ఒక్క రోజే గుడ్డు
- పాఠశాలలో బోధనా సిబ్బంది కరువు
- నిర్లక్ష్యం వీడకుంటే చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరిక

కుల్కచర్ల: మండల పర్యటనలో భాగంగా గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాలకు వెళ్లిన ఎమ్మెల్యేకు సమస్యలు స్వాగతం పలికాయి. సోమవారం స్థానిక ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి బండవెల్కిచర్ల పరిధిలోని గురుకుల పాఠశాలకు వెళ్లగా గేటుకు తాళం వేసి ఉంది. కార్యకర్తలే ప్రహరీ దూకి వెళ్లి తాలాలు తీయడంతో ఆయన లోనికి వెళ్లారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం బోధించే ఉపాధ్యాయులు లేరన్నారు. వారానికి ఒక్క రోజు మాత్రమే గుడ్డు ఇస్తున్నారని చెప్పారు.

ఇంటర్మీడియెట్ బోధన సిబ్బంది డుమ్మా..

పాఠశాల సందర్శనలో భాగంగా కళాశాలకు వెళ్లగా అక్కడ ఒక్క ఉపాధ్యాయుడు లేరు. లైబ్రేరియన్ సంతకం చేసినా.. పాఠశాల ఆవరణలో లేరు. పీడీ ఒక్కరే కళాశాలను పర్యవేక్షిస్తున్నారు. రిజిస్టర్ పరిశీలించగా ఇద్దరి సంతకాలు.. మిగిలిన వారివి ఖాళీగా ఉన్నాయి. గతంలో ఉన్న ప్రిన్సిపాల్ అవినీతికి పాల్పడడం, ప్రస్తుత సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కళాశాలలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదని గ్రామస్తులు ఎమ్మెల్యేకు వివరించారు. సమస్యలను పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్‌సీఓ మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని గ్రామస్తులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. బోధనా సిబ్బంది నిర్లక్ష్యం వీడకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పర్యటనలో పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, యువజన విభాగం అధ్యక్షుడు జంగయ్య, నాయకులు ఆనందం, గోవర్ధన్‌రెడ్డి, కృష్ణయ్య, జలీల్ పాల్గొన్నారు.



రిజిస్టరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే టీఆర్ఆర్



స్వామివారి దర్శనానికి భక్తుల క్యూ

జడివానలో జన జాతర



స్వామివారిని దర్శించుకుని వెళుతున్న భక్తులు

నీళ్లపల్లి అటవీ ప్రాంతంలోని సప్త కొలనులలో వెలసిన ఏకాంబరి ఆలయానికి భక్తులు పోటెత్తారు. జడి వానను సైతం లెక్క చేయకుండా తెలంగాణ, కర్ణాటక సరిహద్దు గ్రామాల నుంచి వందలాదిగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన రామలింగేశ్వరుడి దర్శనానికి బారులుతీరారు. అనంతరం కొలనులోని యాకూబ్‌సాబ్ దర్గాను దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వీరి వెంట పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి, వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ తదితరులు ఉన్నారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. - బషీరాబాద్



పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులు

కనుల పండువగా కల్యాణోత్సవం

భక్తులతో కిటకిటలాడిన బుగ్గ రామలింగేశ్వరాలయం

అనంతగిరి: వికారాబాద్ సమీపంలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసం చివరి సోమవారం పురస్కరించుకుని పార్వతీపరమేశ్వరుల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయానికి భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజల అనంతరం రుద్రాభిషేకం చేపట్టారు. ఆలయ ధర్మకర్త సాత ఆత్మలింగం కుటుంబ సభ్యులు కల్యాణోత్సం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ పూజలకు బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రదీప్ పటేల్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.



మంగళసూత్రం చూపుతున్న అర్చకుడు



కల్యాణోత్సవానికి హాజరైన భక్తజనం

పాంబండకు పోటెత్తిన భక్తజనం

కుల్కచర్ల: శ్రావణమాస చివరి సోమవారం సందర్భంగా మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో చిన్నజాతర ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. స్వామి వారి దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. సాయంత్రం శకటోత్సవం ఘనంగా కొనసాగింది. భక్తులు ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాంబండ ఆలయాభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు.



రామలింగేశ్వరుడి దర్శనానికి బారులు తీరిన భక్తజనం



ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

అటవీ మార్గం.. అంబురామేశ్వరం

పెద్దేముల్: శివనామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి. కర్ణాటక రాష్ట్ర సరిహద్దులోని అంబురామేశ్వర జాతర సందర్భంగా ఉపవాసం ఉన్న భక్తులు సోమవారం దీక్ష విరమించారు. కర్ణాటక-తెలంగాణ రాష్ట్ర సరిహద్దు తట్టెపల్లి అడవిలో ఉన్న అంబురామేశ్వర జాతరకు మండలంతో పాటు తాండూరు, వికారాబాద్, జహీరాబాద్ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ గిరి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వెంకటయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ధారాసింగ్, కోటపల్లి వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ నారాయణ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్, ఎంపీటీసీ మాజీ సభ్యులు శంకర్, లక్ష్మణ్, మాజీ సర్పంచ్‌లు శివరాం నాయక్, బాబుసింగ్, నాయకులు నర్సింలు, జగన్, అంజప్ప, సంజీవ్ పాల్గొన్నారు.



అంబురామేశ్వర ఆలయం వద్ద భక్తుల రద్దీ



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు